230038701

# ప్రబోధ 12

కోటీశ్వరులకైన కూడుగుడ్డయె కాని
బంగారమును తిని బ్రతుకలేడు.
కాలమేగాకున్న కల్లయు పాముగు
కలసి వచ్చిన మట్టికనక మగును
పండితుడౌక చోట పశువుగామారు
మూర్ఖుడౌక తరిని మునిగ మారు
ధనవంతుడౌక పరి దారిద్ర్యదేవత
ప్రేమించి వానితో వరుసలాడు
ప్రాకులాడుటె గాని ప్రాప్తియే లేకున్న
దమ్మిడయ్యినను దరికిరాదు
వద్దురా బాబు వద్దయే ఆశహద్దుమీరి
బుద్దిలో మెలగుము శ్రీసాయివద్ద.

ప్రేమస్వరూపులారా!

భగవంతుని చూస్తూ చూడటంలేదని భావిస్తారు మూర్ఖులు. విశ్వమే విష్ణు స్వరూపము. ఈసత్యాన్ని గుర్తించుకొనలేక మానవుడు భగవంతుడు యెక్కడో వున్నాడని వెతుకుతూ తమ గమ్యాన్ని గుర్తించటానికి ప్రయత్నిస్తున్నారు. వీరు ద్వైతమతమునకు సంబంధించినవారు. దైవత్వము సర్వత్ర వుండినప్పటికి, దివ్యత్వమైన ప్రకృతిరూపము ధరించినప్పటికి మానవుడు దేహమనో అభిమానముల చేత దైవం తనకంటె భిన్నముగా వుండినట్లు భావిస్తున్నాడు.

సర్వమతముల ధర్మము చిత్తనైర్మల్యము. సర్వరసముల సారము కరుణారసమే. సర్వసాధనల గమ్యము శాంతిసౌధము. సర్వజీవుల ప్రేమనే సర్వేశ్వర భక్తి. ఆరోగ్యమునకు దేహశుద్ధి యెంత అవసరమో, ఆనందమునకు మనోశుద్ధి అంత అవసరము. కనుక చిత్తశుద్ధినిమిత్తమై మానవుడు చేయు సమస్త కర్మలందు దివ్యత్వాన్ని విశ్వసించి పవిత్రమైన తత్వాన్ని అభివృద్ధిపరచుకోవాలి.

మానవుడు ఆడంబరములతో, అహంకారముతో, లౌకికమైన భ్రాంతులతో తన

230038702

జీవితమును బంధింప చేసుకొనుచున్నాడు. ఆడంబర, అహంకారములు వున్నంతవరకు ఆనందమునకు అతిదూరమై వుంటాడు మానవుడు. మొక్కరావలెనన్న విత్తనమును భూమిలో నాటవలెను. కాని విత్తనమును బహిరంగముగా అందరు గుర్తింప చేసుకొనే నిమిత్తమై ఒక పెద్దరాతిపైన పెట్టినప్పుడు మొక్క రాదు. అదేవిధముగా అణకువే ఆనందమును నందించును కాని ఆడంబరము ఆనందానికి అతిదూరము. సముద్రము తనయందు విలువైనటువంటి ముత్యములనుంచుకొని విలువలేనటువంటి నత్తచిప్పలను మాత్రమే బయటకు నెట్టివేస్తుంది. అదే విధముగా మానవుడు తనయందు విలువైన, పవిత్రమైన, నిత్యశుద్ధ సత్యమైన ఆత్మతత్వాన్ని గుర్తించుకొని, దేహరూపములైన, నామరూపములైన యీ భౌతికతత్వాన్ని మనము అలక్ష్యపరచాలి. కానీ యీనాటి మానవుడు గుండెబలము, కండబలము ఆధారం చేసుకొని బ్రతుకుతున్నాడే కాని ధర్మబలమును, దైవబలమును ఆధారముగా ఆశించటంలేదు.

దైవమనగా కేవలము సమిష్టిస్వరూపుడనే దీనికి అర్థము. అనగా విశ్వస్వరూపుడైన నారాయణుడే దైవము. సర్వత్రా, సర్వరూపములయందును, సమస్తవిషయములందు దైవత్వము వుంటున్నది. సమస్త సాధకులు తాము ఆచరించే సాధనలన్నీ ఆత్మను తెలుసుకోటంకోసం కాదు. ఆత్మయెల్లప్పుడూ వున్నదే. అనాత్మను తొలగించుకొనే నిమిత్తమై సాధనలు సలుపుతున్నాడు. తాను యేదైవున్నాడో ఆ స్వరూపాన్ని తాను మరచిపోతున్నాడు. తాను కాని స్వరూపాన్ని తనదిగాభావించి మురిసిపోతున్నాడు. ఆత్మను మరచిపోతున్నాడు.

వున్నది ఒక్కటే సత్యము. అదే నేను. ఈ నేను నేను అనేది యెల్లప్పుడునూ వున్నది. గాఢనిద్రలో మానవుడు యనేకవిధములైన తలంపులను మరచినప్పటికి తాను లేకుండా వుండటంలేదు. గాఢనిద్రయందు తన దేహముగాని, తన భావములు కాని, తనగుణములు కాని, తననామములు కాని యేమాత్రము వుండవు. కాని తాను లేనని మాత్రం చెప్పుటకు వీలుకాదు. నేను అనేది గాఢనిద్రయందు కూడ వున్నది. ఆ నేను అనే తత్వాన్ని, వునికిని గుర్తించటమే సాధనలయొక్క రహస్యము. నేను గోపాలుడు నా తండ్రి పేరు భూపాలుడు. నా కుమారుని పేరు నేపాలుడు. ఈ విధముగా తాను, తన తండ్రి, తన కుమారుల తత్వాన్ని, రూపనామాన్ని హనుమంతుని తోకవలె అభివృద్ధిగావించుకుంటూపోతున్నాడే కాని మానవుడు తన తత్వమేమిటో తాను గుర్తించటానికి ప్రయత్నించటంలేదు.

ఈ రూపనామములెవరివి? మనోకల్పితములు. మనోదేహములుండినంతవరకే యీ జగత్తు. ఆత్మ అనగా హృదయమే. హృదయము స్వప్రకాశమైనది. హృదయమునుండి వెలుగు మెదడునకు ప్రసరిస్తూ వుంటుంది. ఆ స్థానమే మనోస్థానము. ఈ హృదయము వెలుగు మనస్సుపైన ప్రసరించటం చేత యీ మనస్సు జగత్తును చూడగలుగుతున్నది. మనసుపైన హృదయము వెలుగు లేకుండిన యీ మనసు జగత్తునే మాత్రం కూడ చూడలేదు. అనుభవించలేదు. మనసే లేకుండిన యీ జగత్తే లేదు. మనోమూలమిదం జగత్. ఈ మనసే చంద్రుడు. పగటివేళ మనము చంద్రుడేవిధముగా అదృశ్యుడై వుండునో అదే విధముగా ఆత్మలక్ష్యమునందు యీ మనసు అదృశ్యమై వుంటుంది. చంద్రుడు స్వప్రకాశకుడు కాదు. సూర్యుని యొక్క కిరణములు చంద్రుని పైన ప్రసరించటం

230038703

చేతనే ప్రకాశిస్తున్నాడు. కనుక సర్వమునకు ఆత్మయే ఆధారము. ఆత్మయే మూలము. ఆత్మయే సర్వము.

కాని అమాయకులైన మానవులు నా దేహమందు ఆత్మవున్నదని భ్రమిస్తున్నారు. దేహము, మనసు, విశ్వము సర్వమూ ఆత్మయందే వున్నవి కానీ ఆత్మ మరొక దానియందు లేదు. సర్వము ఆత్మమయమే. సర్వము ఆత్మస్వరూపమే. సమస్త చర్యలు ఆత్మచర్యలే. జపములు, ధ్యానములు, యజ్ఞములు యాగములు యిత్యాది సాధనలన్నీ కూడను ద్వైతబుద్ధి కలవారి తత్వము తేతప్ప నిజమైనవి కావు. దైవము కాని లేక ఆత్మ కాని భిన్నముగా వున్నది అనే విశ్వాసము కలవారే యీ చర్యలలో పాల్గొంటారు. దైవము తనకంటె భిన్నముగా వున్నాడనే భావన కల్గినవాడే మూర్ఖుడు. దైవము తనకంటె భిన్నముగా లేడు. దైవమునకు హృదయమున్నది. ఆ హృదయమే ఆత్మ. ఆత్మ ప్రత్యేకముగా వున్నదని భావించే వారు దైవానికి హృదయంలేదని భావించేవారే. ఎన్ని గ్రంథములు చదివినప్పటికి, యెన్ని సాధనలు ఆచరించినప్పటికి, ఎందరు మహనీయులను దర్శించినప్పటికి తన తత్వాన్ని తాను గుర్తించుకొనకుండిన తాను పూర్తి మూర్ఖుడే.

ఆత్మలక్ష్యము లేనిసమయమునందే మనకు భగవత్ లక్ష్యము కనుపించుచున్నది. కనుక మన లక్ష్యమును ఆత్మగా వుంచుకున్నప్పుడే యీ జగత్తు అదృశ్యంగా వుంటుంది. ముఖ్యంగా మానవులు చేసే సమస్త సాధనలు మనసుతో చేస్తున్నారు. అదే పెద్ద పొరపాటు. మనసుతో చేసే సాధనలన్నీ మనసు వైపుకే మరల్చును గానీ ఆత్మవైపుకు కావు. యతో వాచా నివర్తంతే అప్రాప్య మనసా సహ. మనసునకు కాని వాక్కునకు కానీ యేవిధమైన దీనితో యీ ఆత్మతత్వాన్ని చెప్పుటకు వీలు లేదు. దొంగ యే నాటికి దొంగను తాను పట్టించటానికి ప్రయత్నించునా? అదేవిధముగనే మనసు ఒక దొంగ. తనను తాను వశము చేసుకొనుటకు యేమాత్రం ప్రయత్నించదు. ఏ విధంగా మనసును అరికట్టుటకు వీలవుతుంది. మనసును ఆత్మవైపు మరల్చినప్పుడు మనసు అప్రయత్నముగా అరికట్టుకోటానికి వీలవుతుంది. అదృశ్యమైపోతుంది మన దృష్టిని ఆత్మవైపు మరల్చాలి. ఈ దృష్టి అంటే యేమిటి. ఈ చర్మచక్షువుల చేత బహిర్ముఖమైన చూపునంతా అంతర్ముఖము గావించుకోటమా? కాదు కాదు. మన దృష్టి నిరంతరము బహిర్దృష్టిగానే వుంటుంది కాని దానిని అంతర్దృష్టిగా మార్చుకొనుటకు వీలుకాదు. ఈ చర్మచక్షువుల స్వభావము బహిర్దృష్టి. అయితే యీ దృష్టిని అంతర్దృష్టి గావించుకోటమంటే అర్థమేమిటి! అనగా జగద్భావమును వీడి, ఆత్మభావమును స్మరించుకోటమే దృష్టి మార్చుకోటం. ఒక చిన్న ఉదాహరణము. అక్కడ silver statue వుంది. silver అనేటువంటి మెటీరియల్ మీద మన మనసు వుండినంత వరకు యీ statue మనకు కన్పించదు. స్వరూపము పైన మన మనసును, యిమిడ్చితే మా silver మనకు కన్పించదు. అదే విధముగ ఆత్మవైపు మన దృష్టిని మరల్చినప్పుడు మన భావమును అమర్చినపుడు యీ జగద్భావము అదృశ్యమైపోతుంది.

నేను, నేను అనే తత్వము సర్వత్రా వుంటున్నది. ముఖ్యముగా మనము దైవము యేరీతిగా వుంటుంది, దైవము యొక్క నామము యేమిటి అనే విషయాన్ని చక్కగా లోతుకు దిగి విచారిస్తే మొట్టమొదటి పేరు దైవమునకు 'నేను' అనేది. ఈ నేను అనే పేరు వచ్చిన తర్వాతనే

230038704

ప్రణవంపేరు వచ్చివుండవచ్చును. ప్రణవం కంటె ముందుది 'నేను'. సమస్త సంకల్పములకంటె 'నేను' అనే సంకల్పము మొట్టమొదట ఆవిర్భవించినది. 'నేను'ను 'నేను'గా గుర్తించినప్పుడు సర్వమును గుర్తించినవాడౌతాడు. ఎట్లనగా అనేనే సర్వత్రా వున్నది. నేనొక question అడుగుతాను. ఎవరు Vice chancellor? షరాఫ్ నేను I అంటాడు. చక్రవర్తి యెవరు అంటాను. అతను నేను అంటాడు. బైరాగిశాస్త్రి యెవరు అంటాను, నేను అంటాడు. షరాఫ్ రూపనామములు, భావములు, సిద్ధాంతములు వేరు. చక్రవర్తి రూపనామములు, భావములు, సిద్ధాంతములు వేరు. బైరాగిశాస్త్రి రూపనామములు, భావములు, సిద్ధాంతములు వేరు. అయినప్పటికి నా ప్రశ్నకు ముగ్గురి నుండి 'నేను' అనేది ఒక్కటిగానే వచ్చింది. I is everywhere. దేశకాలపరిస్థితులు వేరుగా వుండవచ్చు, మనోభావములు వేరుగా వుండవచ్చు, స్థితిగతులు వేరుగా వుండవచ్చు కాని అందరియందు మాత్రము 'నేను' అనేది సమత్వంగానే వుంటున్నది. కేవలం మానవుల యొక్క భ్రాంతులు మాత్రమే మార్చుకుంటూ వస్తున్నారు.

ఒక చిన్న ఉదాహరణము. ఒక వ్యక్తి తాను సంసారిగా వుంటున్నప్పుడు అనగా కుటుంబముతో కూడి వుండినప్పుడు నేను సంసారిని అనుకుంటాడు. అతనికి యే కష్టములో, నష్టములో, బాధలో దుఃఖములో సంభవించినపుడు సంసారమును విసర్జించి ఋషికేశము వెళ్లి సన్యాసము పుచ్చుకుంటాడు. అక్కడ నేను సన్యాసిని అంటున్నాడు. ఈ సంసారి అనుకోటంకాని, సన్యాసి అనుకోటంకానీ వాని భ్రాంతులే. కానీ స్థితి మారింది. గతి మారలేదు. ఇక్కడ నేను సంసారి అన్నాడు. అక్కడ నేను సన్యాసి అన్నాడు. సంసారిలోను 'నేను' వుంది. సన్యాసిలోను 'నేను' వుంది. నేను మారలేదు. ఈ నేను అనేదానికి సంసారి, సన్యాసి అనేవి మనము తగిలించుకున్న వేషాలు. అదే విధముగ నేను బ్రహ్మచారిని, నేను గృహస్థుడను నేను వానప్రస్థుడను, నేను సన్యాసిని - యివన్నీ తగిలించుకొనేటువంటి వేషాలు. ఈ బ్రహ్మచారి, గృహస్థుడు వానప్రస్థుడు, సన్యాసిలలో సమత్వంగా వున్నది నేను. నేనే బాలుడు, నేనే యువ్వనుడు, నేనే వృద్ధుడను, నేనే సర్వమును. నేను అనేది సర్వరూపములయందు వుంటున్నది కనుక ఆ భిన్న అవస్థలను త్యజించి అస్తిత్వాన్ని ఆత్మరూపంలో భావించటమే సరియైన సాధన.

మనసు వుండినంతవరకు మానవుడు సుఖదుఃఖములతో కూడి వుంటాడు. ఉదయించునది అస్తమించునది, కలియునది విడిపోవునది, వచ్చునది పోవునది అహమే కాని ఆత్మకాదు. ఈ అహం ఆకారములో వుండిన అహంకారముగా మారిపోతుంది. అహం అనగా నేనే. ఆకారమును త్యజించినప్పుడే తాను తానుగా వుండగలడు గాని, ఆకారమును చేర్చుకున్నంతవరకు తాను తానుగా వుండలేడు. నిజమైన ఆత్మస్వరూపము నేను ఆకారముతో కూడివుండటమే అహం+ఆకారం = అహంకారం అయిపోయింది. అహంకారం వుండరాదు. దారితప్పి నడచేటువంటి వ్యక్తి యెన్ని ప్రమాదములకు గురి అవుతాడో, నీతి తప్పి నడిచేటువంటి వ్యక్తి అన్ని అవమానములకు గురి అవుతాడు. ఆ నీతియే మానవజాతి. ఆ జాతియే ఆత్మసంబంధమైన జాతి. అదియే దివ్యత్వముతో కూడినటువంటిది. ఇట్టి దివ్యత్వాన్ని విస్మరించి, అస్థిరమైన, అశాశ్వతమైన, అసుఖము నందించే యీ భౌతికమైన రూపనామములతో లీనమైపోతున్నాము. కనుక ప్రతి

మానవుడు మనస్తత్వమనేటువంటి దానిని క్రమక్రమంగా మాయ రూపంలో భావించాలి. ఈ మనసు
ఏదేది కల్పితమైనది. ఇది ఒక్కొక్క సమయములో ఒక్కొక్క రూపాన్ని ధరిస్తుంది. ఇది కేవలము ఇంద్రి
యములను మాత్రమే అనుసరిస్తూవుంటుంది. ఈ ఇంద్రియముల కోరిక చేతనే సుఖదుఃఖములను
అనుభవిస్తుంది. సుఖదుఃఖములుకాని, లాభనష్టములుకాని, నిందాస్తుతులనుకాని అనుభవించేది
మనసుకాని ఆత్మకాదు. కనుక ఇవి మనోకల్పితమైన స్వరూపాలు. మనస్తత్వాన్ని మనము కొంచెం
గమనించామంటే ఆత్మతత్వం మనకర్థమవుతుంది. ఉన్నది ఒక్కటే. అదే ఆత్మ. సర్వత్రా వున్నది
ఆత్మనే. సర్వపదార్థములు ఆత్మయే. అట్టి అద్వైత దృష్టిని మనం కోల్పోటం చేతనే ఈ ద్వైత దృష్టితో
దుఃఖములకు గురియైపోతున్నాము.

మానవుడు ప్రతి విషయంలో మొట్టమొదట తనను తాను గుర్తించుకోటానికి
ప్రయత్నిస్తున్నాడు. దేనికోసం బ్రతుకుతున్నావంటే నాకోసం నేను బ్రతుకుతున్నానని జవాబు వస్తుంది.
ఇదియే విధంగా నీవు నాకోసం నేను బ్రతుకుతున్నానని జవాబు చెప్తున్నాడని ప్రశ్నిస్తే నా నిమిత్తమై
నేను నిద్రిస్తున్నాను, నాకోసం నేను భోజనం చేస్తున్నాను. నా నిమిత్తమై నేను జీవిస్తున్నాను అంటాడు.
మరొకరు భుజిస్తే నా ఆకలి తీరదు. నా కాలు విరుగుతే మరొకరు కట్టుకుంటే నా కాలు సరిపోదు. మే
ము ఇరువురం ఒక మంచంపైన పరుండినప్పటికి నా కల నాదే వాని కల వానిదే. దీనిని పురస్కరించు
కొని ప్రతి ఒక్కటి నేనే అనే జవాబు పలుకుతుంటాడు. కొంతదూరం ప్రయాణం సల్పిన తరువాత
యెక్కడైనా ఒక ఫ్రెండ్ కలసి అయ్యా! మనం యెక్కడకైనా ఒక యాత్రగా వెడదాం రండి అన్నప్పుడు
అయ్యో నేను ఆఫీసుకు లీవు పెట్టటానికి వీలులేదు. నా యింటిలో పిల్లలు, భార్య చాలా అవస్థపడు
తుంటారు. ఎవరూ వారిని రక్షించటానికి వీలుకాదు. ఇప్పుడు నేను రావటానికి వీలుకాదు అంటాడు.
మరి అదే వ్యక్తిని యెందుకు వుద్యోగం చేస్తున్నావని ప్రశ్నించినప్పుడు నా ఆలుబిడ్డలను నేను పెంచుకోవా
లి అంటాడు. ఇంతకు పూర్వం నాకోసం నేను బ్రతుకుతున్నానన్న వ్యక్తి యిప్పుడు నా కుటుంబము కో
సం నేను బ్రతుకుతున్నానంటాడు. తనకోసం, తన కుటుంబం కోసం తను బ్రతుకుతున్నట్లుగా
చెప్తాడు. చాలామంది యీ రెండు సంబంధములతోనే జీవితాన్ని గమ్యంగా అనుభవిస్తున్నామ
ని అనుకుంటారు. కాదు. కాదు. మూడవది మరొకటి వుంటున్నది. అదే సమాజము. అదే ప్రపంచ
ము. ప్రపంచములో యే బాధలు యెవరికి సంభవించినప్పటికి అది నాకు కూడా సంబంధం
గా వుంటుంది. నా దేశం బాగున్నప్పుడే నేను బాగుంటాను. నా సమాజం అనేక విధములైన
అష్టకష్టములకు గురియైనప్పుడు నేనూ ఆ అష్టకష్టములలో ఒకటిగా వుంటాను. నా గ్రామం
బాగుండినప్పుడే నేనూ బాగుంటాను. గ్రామం యేమైనా అయిపోనీ నేను మాత్రం బాగుండా
లి అని ఏ వ్యక్తి కోరటానికి వీలులేదు. కోరినప్పటికి తాను బ్రతుకలేడు. సమాజము నందే
పుట్టి సమాజమునందే పెరిగి, సమాజములో జీవించే వ్యక్తి సమాజమును దూరముగా విం
చుకొని ఒక్క క్షణమైననూ జీవించటానికి వీలుకాదు. సమాజము నిమిత్తము నేను బ్రతుకు
తున్నాను.. ఏలాగా తాను సమాజము బాగుండినప్పుడే తన కుటుంబము బాగుంటుంది. తన

230038706

కుటుంబము బాగుండినప్పుడే తాను సంతోషిస్తూ వుంటాడు. కట్టుకడుపటికి తను బాగుండేదియెప్పుడు. తనయొక్క కుటుంబము బాగుండాలి. తన కుటుంబము యెప్పుడు బాగుంటుంది. సమాజము బాగుండినప్పుడే. కనుక సమిష్టి స్వరూపమైన తత్త్వము క్షేమముగా వున్నప్పుడే మన మందరము క్షేమంగా వుంటాము.

కనుకనే భగవంతుడు త్రిమూర్త్యాత్మక స్వరూపుడన్నారు. వ్యష్టిస్వరూపం ఒకటి. కుటుంబస్వరూపం రెండవది. విశ్వస్వరూపం మూడవది. ఇదే త్రిమూర్తిస్వరూపము. ఈ త్రిమూర్తులయందును ఒకే ఆత్మస్వరూపం. అదే దైవత్వము. దైవ అనే పదమునకు సమిష్టి స్వరూపమని పేరు. నా చేతులు వేరుగా వుంటున్నాయి. నా కాళ్లు వేరుగా వుంటున్నాయి. నా చెవులు వేరుగా వుంటున్నాయి. నా కన్నులు వేరుగా వుంటున్నాయి. నా సర్వాంగములు వేరుగా వుంటున్నాయి. అయితే సర్వాంగములకు సమానమైనటువంటి తత్త్వము నా గుండె ఒక్కటే. ఒక్కొక్క అంగమునకు ఒక్కొక్క గుండె లేదు. అదే విధముగనే ఒక్కొక్క దేశము, ఒక్కొక్క గ్రామము, ఒక్కొక్క టౌను యివి వేరు వేరు అంగములుగా వుండవచ్చును. అన్ని అంగములందును సమిష్టిస్వరూపుడైన దైవము ఒక్కడే. అతనే గుండె. అతనే హృదయము. ఈ దేహమనే దేశము భగవంతుని కాక దేవాలయము. ఈ ప్రపంచము భగవంతుని విశాలమైన వ్యక్తస్వరూపము కనుక భగవంతుని చూడాలనుకొన్నప్పుడు యీ విశ్వస్వరూపాన్ని మనం భగవంతునిగా దర్శించినప్పుడే యిది నిజమైన భగవంతుని దర్శనము.

సమస్త శాస్త్రములు, సమస్త ధర్మములు, సమస్త వేదములు, సమస్త యితిహాస పురాణములు యివన్నీ ద్వైత భావములే. ఈ ద్వైత భావములో వుండిన ప్రతిమానవునికి కొంతకాలం ద్వైతాన్ని అనుసరించాలి. తన దృష్టి సృష్టిపైన వుండినంతవరకు యీ సృష్టిభావమే తనయందు ఆవిర్భవిస్తుంది. జగద్భావము నందే తాను తాదాత్మ్యుడై వుంటాడు. కనుక యీ జగద్భావము వున్నంతవరకే యీ శాస్త్రములు, యీ నూతన వర్షములు, యీ జ్యోతిశ్శాస్త్రము, సర్వశాస్త్రములు అత్యవసరమే. కాలముతో కూడినది యీ జగత్తు. కాలస్వరూపమే యీ జగత్తు. కనుకనే వేదము కాలాయనమః, కాలకాలాయనమః, కాలాతీతాయనమః, కాలదర్పదమనాయనమః, కాలస్వరూపాయనమః, - - అంతా కాలమే ప్రధానముగా చూసుకుంటూ వచ్చింది. ఈ కాలము పంచేంద్రియములతో కూడి వుంటున్నది. ఈ పంచేంద్రియముల ప్రభావమే పంచాంగము అని. ఈ పంచాంగము జ్యోతిశ్శాస్త్రము ననుసరించి, సూర్యచంద్రాదులననుసరించి, కాలకర్మకర్తృత్వము ననుసరించి మారుతూ వుంటాయి. పంచాగము జరగబోయే విషయమును మాత్రమే నిరూపిస్తుందిగాని, పంచాగము దాని పరిహారాన్ని పట్టుకొనిరాదు. ఈ పంచాంగములో రేపటిదినం పది దిక్కులు వర్షం కురుస్తుందని వ్రాస్తారు కాని పంచాంగం పిండితే పది చుక్కలైనా నీరు రాదు. ఈ పంచాంగతత్త్వమనేది ప్రాకృతమైన స్వరూపాన్ని కొంతవరకు చిత్రిస్తుంది. ఈ ప్రపంచమంతా నవగ్రహములతో కూడి వున్నదని వారి భావము. ఈ నవాధిపతులయందు యీ సంవత్సరము యేడుమంది అధిపతులు చాలా వుత్తమమైనటువంటి వారుగా వున్నారు. రాజు, మంత్రి - చంద్రుడు, కుజుడు యీ సంవత్సరం చాలా బలమైన వారుగా వున్నారు. శనికి యీ సంవత్సరములో యేమాత్రం స్థానం లేదు. కనుక యీ సంవత్సరం యీ జగత్తు

230038707

లోపల నుండి తీర్థాదులకు యే మాత్రం లోటు లేకుండా జరుగుతుంది. నూటికి ఎనభై వంతులు ఆహారము అభివృద్ధి అవుతుంది.

కాని ప్రాకృతమైన మార్పులు యెంత మంచివి కల్గినప్పటికి మానవుని మనసు పరివర్తన చెందకపోతే అన్నీ నిరుపయోగమే అవుతాయి. కావున యీనాడు మానవుని పరివర్తన అత్యవసరమైనది. ఈ మనసును పవిత్రమైన మార్గమునందు, ఆత్మ తత్వమునందు, విశాలమైన రీతిగా మార్చుకున్నప్పుడే యీ జగత్తు నిరంతరం సుభిక్షంగా వుంటుంది. చాలామంది తపస్సు చేస్తున్నామంటారు. తపస్సంటే యేమిటి? తలక్రిందకు పెట్టి, కాళ్లు పైకి పెట్టి యేదో నామాన్ని స్మరించటమా? కఠినమైన హృదయాన్ని కరిగి ప్రవహించేటువంటి రీతిలో మనము మార్చుకోటమే తపస్సు. బాధ పడేటువంటి వ్యక్తులను, దీనులను, దిక్కు లేని వారిని చూచినప్పుడు మన మనసు కరిగిపోవాలి. మన హృదయము ద్రవించాలి. అదే తపస్సు ఫలితము. హృదయము కఠినమైన శిలగా నుంచుకొని, యెని సాధనలు చేసినప్పటికి యివి కేవలము నిరుపయోగమైనటువంటివే. కాలమును వ్యర్థము గావించేటువంటివే. అనేమంది ధ్యానము, ధ్యానము అంటున్నారు. ఏది ధ్యానము. ధ్యానమంటే యేమిటి? మన జీవితమే ఒక ధ్యానము. తెల్లవారి లేచినది మొదలు పరుండే వరకు మనము ధ్యానములోనే వున్నాము. లేచిన తక్షణమే బాత్‌రూమ్‌కి పోవటము, ముఖమును clean చేసుకోటం యీ ధ్యానములోనే వుంటాము మనము. అవి అయిపోయిన తక్షణమే కాఫీ టిఫిన్ ధ్యానములోకి పోతాము. అది అయిన తక్షణమే డ్రెస్ వేసుకొని ఆఫీసు ధ్యానములో వుంటాము. ఈ ఆఫీసుకు పోయే లోపల రోడ్డు మీద ఏ బస్సు వస్తుందో, ఏ కారు వస్తుందో, ఏ ఏక్సిడెంటు అవుతుందో అని మనము క్సిడెంటు పైన ధ్యానము లోనికి పోతుంటాము. ఆ రోడ్డునకు సంబంధించిన ధ్యానమే లేకపోతే ఆఫీసుకు మనం చేరలేము. మనము కాలేజీకి పోతే చదువు ధ్యానములో వుంటాము. Play ground కి పోతే ఆట ధ్యానములో వుంటాము. మార్కెట్టుకు పోతే విషయాల ధ్యానములో వుంటాము. యివన్నీ ధ్యానము లేకదా. ధ్యానమనేది లేకపోతే యే చిన్న పని చేయలేము. అనగా ఒక్కొక్క విషయంపైన మనసును మరల్చటమే ధ్యానము. ఈ మనసునే దైవము వైపు మరల్చినప్పుడు దైవ ధ్యానమంటారు.

కనుక ధ్యానమునకు ఒక ప్రత్యేకమైనటువంటి కాలము ప్రత్యేక పద్ధతి మనకు అవసరము లేదు. ఈ ధ్యానమునకు అనేకమంది అనేక రూప నామములు కల్పించి కడపటికి నిజమైన ధ్యానాన్ని మరుగు పరుస్తున్నారు. ఒక చిన్న ఉదాహరణము. నేను యిప్పుడు మాట్లాడుతున్నాను. స్వామి మాట్లాడేది యేమిటి అని దీనిపైన ధ్యానమే లేకపోతే నేను చెప్పినదేమిటో మీకు అర్థంకాదు. ఇది కూడా ధ్యానమే. కనుక ధ్యానమనే దానికి ఒక రూపం లేదు. చంచలమైన యీ మనసుతో ధ్యానము చేయుట మనేది ఎవ్వరికి సాధ్యంకాదు. ఇప్పుడు ధ్యానం, ధ్యానం అనే పేరుతో కేవలం అన్ని విధాలా ప్రయత్నాలు జరిగిపోతున్నాయి. నీవు గంట రెండు గంటలు అనవసరంగా యీ చంచలమైన మనసును, కోతివంటి మనసును పట్టుకొని, అనేక విధములుగా అశాంతికి గురయ్యే బదులు, నీవు యింటి పనులు చేసుకో, ఆఫీసు పనులు చేసుకో, సమాజ పనులు చేసుకో. అది ధ్యానం కాదా. కాలమును యెంత వ్యర్థము చేస్తున్నారు. ఒక గంట కూర్చున్నప్పటికి ఒక సెకనైనా మనసును అరికట్టుకోటానికి కాదు. ఈ ధ్యానం

230038708

పేరుతో నీవు ఒక గంటను వేస్తు చేస్తున్నావు కదా నీవు ఆ కాలమును నీవు గృహకృత్యములలో ప్రవేశపెట్టు. నీవు అన్నిపనులు చేస్తూ కూడా దైవాన్ని చింతించు. ఇవన్నీ దైవము యొక్క స్వరూపాలుగానే భావించు. ఇది యెంత సులభముగా వుంటుంది. ఇంత సులభమైన మార్గాన్ని వదలిపెట్టి అనేక శ్రమలకోర్చి పెద్ద కసరత్తు చేసి యేమేమో బాధలకంతా గురి అవుతున్నారు. Do your duty sincerely. నీ కర్తవ్యాన్ని నీవు చక్కగా ఆచరించు. అది ఆచరించటానికి విరుద్ధంగా టైమును వ్యర్థం చేసుకోటం, ధనమును వ్యర్థం చేసుకోటం. అమూల్యమైన కాలాన్ని మనము అరక్షణం కూడా వ్యర్థం చేయరాదు. కనుక ధ్యానము అనేటువంటిది కేవలం ఒక్క విషయానికి మాత్రమే సంబంధించినది కాదు. సర్వ విషయములందు ధ్యానమును సమత్వంగా మనము ప్రసరింప చేసుకోవాలి.

ఇంకా మరి కొంతమంది యేకాంతవాసము జరపాలని భావిస్తూ వుంటారు. ఏకాంతమంటే యేమిటి? ఒంటరిగా కూర్చోటమా? అది సరియైనటువంటి అర్థం కాదు. అనేకమంది నేను యేకాంతవాసంగా వుండాలి, నేను ఏ అరణ్యాలలో పోయి కూర్చోవాలి అని భావించి యే ఋషీకేశ్కో, ఏ హరిద్వారమో ఏ తపోవనములోకో పోయి కూర్చుంటారు. ఇది యేకాంత తత్వాన్ని అర్థం చేసుకోలేని వ్యక్తులే యీ విధమైన వ్యర్థప్రపంచములలో ప్రవేశిస్తారు. ఏకాంతమనగా మనసును స్తంభింప చేయటమే. నీవు అరణ్యములో కూర్చుని కూడను నీ మనసు ప్రపంచమంతా సంచారము చేస్తుంటే యేకాంతవాసమెలా అవుతుంది. సంకల్పాలను అరికట్టకుండా యే స్థానంలో పోయి శరీరముతో కూర్చుండినప్పటికి యిది యేకాంతం కాదు. సమాధి అన్నా అదే. సంకల్పములను నిరోధించటమే సమాధి. సంకల్పములు లేకుండా చేసుకోవాలి. లేక సంకల్పములుండి కూడను దైవసంకల్పములుగా మన సంకల్పములను భావించాలి. ఆ సంకల్పములు సమయమందు యీ సంకల్పము యెప్పుడు వస్తున్నాయి, యే విధముగా వస్తున్నాయని విచారణ చేయాలి. నేను, నేను, నేను అనేటువంటి సంకల్పము వచ్చిన తరువాత యీ సంకల్పములన్నీ ప్రవేశిస్తున్నాయి.

కొంతమంది యీ జగత్తులోపల ధ్యానమునందుగాని, యోగమునందుగాని, లౌకిక జీవితమునందుగాని సర్వసౌఖ్యములను అనుభవిస్తున్నామని ఆనందిస్తుంటారు. వీరు నిజమైన ఆనందమేమిటో గుర్తించుకోలేని వారే. ఈ సౌఖ్యములంటే యేమిటో దాని అర్థాన్ని తెలుసుకోలేని వారే. చక్కగా విచారించి చూస్తే సౌఖ్యములను నీవనుభవిస్తున్నావా లేక నిన్నే సౌఖ్యములనుభవిస్తున్నాయా అని యోచన చేసుకో. కాదు కాదు. ఈ సౌఖ్యములే నిన్ను అనుభవిస్తున్నాయి. మానవుని సర్వసౌఖ్యములను అనుభవించి దాని వల్ల యీ శరీరమునందున్న సమస్త శక్తిని సంహరించి యీ శరీరములో రాగద్వేష అసూయ, ధంబాలనే రోగములను కల్పించి పోతుంది. దేహముతో అనుభవించే సౌఖ్యములు నిజముగా సౌఖ్యములు కావు. సౌఖ్యములు దేహాన్ని అనుభవించి దేహాన్ని అన్నివిధాలా శిథిలముగా చేస్తున్నాయి. నిజంగా నీవు సౌఖ్యములే అనుభవిస్తే దేహము యెందుకు శిథిలం కావాలి? దేహమెందుకు బలహీనం కావాలి? దేహమెందుకు వార్ధక్యములో మునగాలి. సౌఖ్యములు యీ దేహాన్ని అనుభవించాయి కనుక దీనిని పిల్చి పిప్పి చేసి కేవలము వార్ధక్యములో ముంచి పోతున్నాయి. కనుక నీవు నీది కానటువంటి సౌఖ్యాన్ని నీదిగా భావించుకొని నీవు మురిసి పోతున్నావు. నీ తత్వాన్ని నీవు మరచి పోతున్నావు.

230038709

మొట్టమొదట ప్రతి మానవుడు కూడను నేనెవరు, నేనెవరు నేను అనే టువంటి తత్వాన్ని గుర్తించాలి. నేనే సర్వత్రవున్నాను. నేనే సర్వస్వరూపాన్ని. నేనే ఆత్మను.

ఆత్మయే హృదయము. హృదయము ఆత్మ ప్రత్యేకము కావు. ఈ నేను అనే స్థానాన్ని దాని వునికిని మనం గుర్తించటానికి ప్రయత్నించటమే మన సాధన. ప్రతి మానవుడు యేదో తెలియనటువంటి మార్గములో ప్రవేశించి తద్వారా అనేక విధములైన చికాకులలో పడిపోయి నిజమైన ఆధ్యాత్మిక మార్గాన్ని కొంతవరకు విస్మరిస్తున్నారు. మనము యీనాడు చేసే ప్రతిసాధన ద్వైతభావముతోనే చేస్తున్నాము. ఎంతకాలమైనా మనం ద్వైతంలోనే వుంటుంటే మన జీవితము వ్యర్థమే. క్రమక్రమేణా మన దృష్టిని మార్చుకుంటూ రావాలి. సృష్టి తత్వమంతా మన కల్పనే అన్న సత్యాన్ని మనం అర్థం చేసుకోవాలి. మన దృష్టి వుండినప్పుడే మన సృష్టి వుంటుంది. మన నేత్రము వుండినంతవరకే శాస్త్రము మనను శాసిస్తుంది. కనుక విశ్వం విష్ణుస్వరూపం అనే టువంటి సత్యాన్ని గుర్తించాలి. మనం అనేకరకములుగా సాధనలు సల్పుతున్నాము. భజనలు చేస్తున్నాము. జపములు చేస్తున్నాము. పూజలు చేస్తున్నాము. యజ్ఞములు చేస్తున్నాము. యాగములు చేస్తున్నాము. వీటి కన్నింటికి నేను లభించేటువంటి వాడను కానని భగవద్గీత యందు 11 వ అధ్యాయములో 48 నుండి 52 వ శ్లోకము వరకు స్పష్టముగా బోధిస్తూ వచ్చింది. యజ్ఞాలకు నేను చిక్కను. యాగాలకు నేను వశము కాను. జపధ్యానములకు నేను లభించను. అయితే యివన్నీ విసర్జించమని కాదు. ఇవి యెంత వరకు మనకు అవసరమో. ద్వైతభావములో వున్న మానవునికి యివి అవసరము.

గీతను విశ్వసించే వారంతా యీ విషయము చక్కగా గుర్తించాలి. అనిత్యం అసుఖం లోకం అని బోధించింది. ఇలాంటి అనిత్యము అసుఖము అయిన లోకములో మనము నిత్యసత్యమైన సుఖ శాంతులను మనమే రీతిగా సాధించగలము. మనయందు శాశ్వతమైన, సత్యమైన తత్వమొకటుంది. దాని ద్వారా మనము శాశ్వతత్వాన్ని సాధించాలి. అదే ఆత్మతత్వము. సముద్రము యెంత విశాలమైనటువంటిది, అగాధమైనటువంటిది అయినప్పటికి ఆ సముద్రము కూడను తనలో విలువైన ముత్యములుంచుకొని, విలువలేని నత్తచిప్పలను బయటకు గెంటుతుంది. కనుకనే సాగరాన్ని సంసారానికి పోల్చారు. సంసారం సాగరం అన్నారు. మన సంసారం కూడను అట్లే వుండాలి. విలువైన ఆత్మతత్వాన్ని మనం భద్రపరచుకొని విలువలేని యీ భావములు, యీ రూపములు, యీ నామములు మనము విసర్జించటానికి ప్రయత్నించాలి. ఎంతకాలమైనా దేహభ్రాంతులు, ఎంతకాలమైనా దేహరూపాలుగానే మనం జీవిస్తూపోతే యింక దేహాతీతమైనటువంటి, రూపాతీతమైనటువంటి, భావాతీతమైనటువంటి నిజతత్వాన్ని యేనాడు మనము అనుభవించేది. అట్లని యీ సర్వస్వాన్ని త్యజించమని కాదు. నీ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తించుకుంటూ ఆత్మతత్వాన్ని లక్ష్యమునందుంచుకోవాలి. చేసేది ఆత్మ. చేయించేది ఆత్మ. అనుభవించేది ఆత్మ. సర్వమునూ ఆత్మనే అనే విశాలభావాన్ని మనం అభివృద్ధిపరచుకున్నప్పుడు క్రమక్రమేణా అది ఆ విశాలతత్వానికి చేరుస్తుంది. మనం చేరటానికి కష్టమైనప్పటికి లక్ష్యం పెట్టుకోవాలి. ఉత్తమ లక్ష్యం మనయందు వుండినప్పుడే యీనాడు

230038710

కాకపోతే యేనాటికైనా ఆగమ్యాన్ని చేరవచ్చును. దీని గురించే తెలుగువారు ఒక సామెత చెప్తుంటారు. వెంటబడి కుంటినక్కను కొట్టేదానికంటే గురితప్పినాసరే పులినే కొట్టరా అన్నారు. కనుక యీ చిన్న చిన్నదానిలో మనం యంత్రశ్రమపడి యున్ని అవస్థలు గురిఅయ్యేదానికంటే నిజమైన ఆత్మతత్వంపైన లక్ష్యం పెట్టుకోండి. దాంట్లో ఫెయిలైనా పరవాలేదు. విజయాన్ని సాధించినవారమే అవుతాము. మనం ఒక్కదానిలో విజయాన్ని సాధిస్తే మిగిలిన విజయాలంతా మనకు తమంతతామే ఫాలో అవుతాయి. ఎప్పుడూ యీ అనిత్యమైన, లౌకికమైన దానిపైన మనము నిరంతరము అపజయాన్ని పొందుతుంటే మనము అపజయము లోనే మునిగిపోతాము. విజయానికి యేమాత్రం ముందంజ వేయలేము.

ప్రతిమానవుడు కూడను నేను ఆత్మ నేను ఆత్మ అనే భావాన్ని అభివృద్ధిపరచుకోవాలి. అయితే I am Brahma. I am Brahma అనుకున్నప్పుడు యీ బ్రహ్మకు ముందుగా I అనే టువంటిది ఒకటుండి. ఇక్కడ కూడా నేను అనేటువంటిది వుంది. ఆ నేను యెవరు. నేను బ్రహ్మ అనుకోటంలో కూడను నేను అనే దానిని అర్థం చేసుకోవాలి. దీని అర్థమేమనగా బ్రహ్మ వ్యాపించటం నేను అనేది వ్యాపించటంతో కూడినది. కనుక నేనే సర్వత్రా వుండినటువంటిది నేనే అనే తత్వం అర్థమవుతుంది. ఏమి చేసినా, యేమి చెప్పినా, యేమి తలచినా, అంతా దైవభావముతో కూడివుండినప్పుడే తాను నిజమైనటువంటి I ని గుర్తించినవాడౌతాడు. దేహభ్రాంతి వుండినంత వరకే యీ జగత్తు. నిత్యజీవితములో మనం అనుభవిస్తూనే వున్నాం. నిద్రలో వున్నాము. నిద్రలో మనం యే సామానులు చూడటం లేదు. ఏ పదార్థాన్ని మనం ముట్టడం లేదు; ఏ ఆహారము మనం భుజించటం లేదు. ఏమీ లేనటువంటి స్తంభించిన సమయములో ఆనందాన్ని అనుభవిస్తున్నాము. ఆగాఢనిద్రలో నీకు శరీరము కాని రూపము కాని, భావము కాని గుణము కాని యేవీ అక్కడ కనుపించటం లేదు. నీవు మాత్రము వున్నావు. జాగ్రత్ స్వప్న సుషుప్తులయందు నీవు వున్నావు. స్థూల సూక్ష్మ కారణ శరీరములందు కూడను నీవు అనేటువంటిది వున్నది. ఈ అన్నిటియందు మార్పు చెందనిది యేదివున్నదో అదే ఆత్మతత్వము. దీనినే వేదాంతము నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్యశుద్ధ బుద్ధ ముక్త నిర్మలస్వరూపం అని వర్ణిస్తూ వచ్చింది.

ధ్యానముగాని, జపముగాని చేసేటువంటి దేహము నీటిబుడగ. దీనిని ఆధారము చేసుకొని నడచే మనసు చూస్తిమా పిచ్చికోతి. ఈ పిచ్చికోతివల్ల, నీటిబుడగవంటి యీ దేహమువల్ల శాశ్వతమైన ఆత్మను నీవు పొందటానికి వీలవుతుందా. ఇది తాత్కాలికమైన తృప్తి తప్పయిది సరియైన ఆత్మానందము కాదు. చెట్టు ఆకునకు కొనభాగమున వుండిన నీటిబిందువువలె వుంటున్నాది యీ దేహము. ఏక్షణము లో యీ నీటిబిందువు రాలిపోతుందో. ఇలాంటి దానితో శాశ్వతమైనటువంటి ఆత్మను పొందటానికి యెట్లా అవకాశము చిక్కుతుంది. భజనలు చేయటం కాని, ధ్యానము చేయటం కాని, పూజలు చేయటం కాని, తాత్కాలికముగా యీ మనసును అరికట్టటానికి చేసే వుపాయములే తప్ప యివి నిజమైనటువంటి మార్గములు కాదు. కాని ఒక్కటి మాత్రము శాశ్వతము. నేనెవరు నేనెవరు యీ విచారణ చేస్తూ ఆ నేను అనేది యెక్కడ ప్రారంభమవుతుందో అక్కడకు పోయి మనము చేరాలి. ఇది నా దేహము. ఇది నా మనసు, యిది నా బుద్ధి, యిది నా చిత్తము, నా యింద్రియములు, నా అంతఃకరణ నేనెవరు అని ప్రశ్న వేసు

230038711

కుంటూరావాలి. ఇది నా దేహము. దేహము వేరు. నేను వేరు. ఇది నా వస్త్రము. వస్త్రము వేరు. నేను వేరు. ఇది నా శరీర శరీర వేరు నేను వేరు. కనుక నా మనసు, నా బుద్ధి, నా చిత్తము, నా యింద్రియములు, నా అంతఃకరణ యివన్నీ వేరు నేను వేరు. కాబట్టి ఇవన్నీ నేను కాదు అని కొంతవరకును విచారణ చేస్తూరావాలి. ఈ విధముగా నెప్పుడూ విచారణ చేస్తూరావాలి. ఎవరో నిన్ను తిట్టారు. ఎవరో నిన్ను వర్ణించారు. వర్ణన యెవరికోసం. దేహానికి ఆ తిట్టింది యెవరికోసం. దేహానికి. కాబట్టి నీవు రెండూ కాదు. ఆ విధంగా కూడ నుత్యాగభావములో పోవాలి. దేహము నుదేహము దూషించటానికి దేహమునకు యేమి అధికారముంది. అదీ జడము యిదీ జడము. జడము జడాన్ని యేరీతిగా దూషించగలదు. యేరీతిగా పూజించగలదు. కాదు కాదు. ఆత్మనుగా ఆత్మను దూషిస్తున్నారంటే అక్కడా ఆత్మే యిక్కడా ఆత్మే. రెండు వున్నది ఒక ఆత్మయే. ఎవరిని యెవరు దూషించటము.

అదే విధముగా ఒకడు దేవుడున్నాడంటాడు. ఇంకొకడు లేడు అంటాడు. లేడనేటువంటివాడు దేవుడిని చూశాడు. దేవుడున్నాడనే వాడు దేవుడిని చూశాడు. దేవుడినే చూడకుండిన లేడని చెప్పటానికి వానికి అధికారమేలేదు. ఇక్కడొక చిన్న ఉదాహరణము. ఇది ఒక Kerchief అన్నారు. లేక యితను ఒక నంజుండయ్య అని పేరుపెట్టారు. ఈ నంజుండయ్యను చూసినటువంటి వాడు యితను నంజుండయ్య అని గట్టిగా చెప్తాడు. ఇంకొకరిని చూచిన వాడు యితను నంజుండయ్యే కాదు అని చెప్పువచ్చును. చక్రవర్తిని పిలచి యితను నంజుండయ్య అంటే అతను నంజుండయ్య కాదు అతను చక్రవర్తి అంటాడు వాడు. కాబట్టి నంజుండయ్య కాడనేటువంటి వాడు కాని, నంజుండయ్య అవుననేటువంటి వాడు కాని నంజుండయ్యను చూసి తీరాలి. నంజుండయ్యనే చూడని వానికి నంజుండయ్య కాదు అనటానికి అధికారం లేదు. నంజుండయ్య అవును అనటానికి అధికారం లేదు. అదే విధముగా దైవాన్ని చూసినటువంటివానికే యితను దైవం కాదు అని చెప్పటానికి అధికారం వస్తుంది. కనుక నేడు ప్రతిమానవుడు తెలిసీ తెలియనటువంటి మూర్ఖత్వములో పడిపోతున్నాడు. కనుక యీ అవును కాదు అనేది మాటల మ్యాజిక్. పదముల యొక్క అలలు. అంతే కాని యిందులో యేమాత్రం యదార్థం లేదు. ఒకరు అవునన్నా ఒకరు కాదన్నా ఆ మాటలు వారి భావములో కాని పదార్థాన్ని అవును కాదనటానికి యెవ్వరికినీ అధికారం లేదు. కనుక యిరువురికినీ దైవము వున్నాడు. ఉన్నది ఒక్కడే. ఏకం యేవ అద్వితీయం బ్రహ్మ. అలాంటి బ్రహ్మనే ఆత్మ. చాలామంది అనుగ్రహం కావాలి. భక్తి కావాలి. ప్రేమ కావాలి అని ఆశిస్తుంటారు. ప్రేమ. భక్తి వినయము విశ్వాసము యివన్నీ ఆత్మస్వరూపాలు. విశ్వాసము వేరు దైవము వేరు కాదు. దైవము, విశ్వాసము రెండూ ఒకటే. ప్రేమ, భక్తి వేరు కాదు ప్రేమ భగవంతుడు. భక్తే భగవంతుడు. భక్తి అనగా యేమిటి? అవ్యక్తమైన తత్వాన్ని వ్యక్తీకరింప చేసుకోటానికి వుపయోగించుకొనేది కనుక దానిని భక్తి అన్నారు. అన్నిదైవత్వానికి చెందినటువంటివే. దైవము తప్ప అన్యము లేదు. ఆ విశ్వాసములో మనము కర్మలు ఆచరిస్తూ పోయినప్పుడు మనము శాశ్వత తత్వాన్ని గుర్తించటానికి వీలవుతుంది. అట్టి శాశ్వతమైన దానిని లక్ష్యములో పెట్టుకొని అశాశ్వతమైన కొన్ని సాధనలు ఆధారం చేసుకొని మనం పోవాలి. అనంతమైన, అగాధమైన సముద్రమును

230038712

దాటాలంటే మనం యీదవేస్తున్నాము. చిన్న పడవను తీసుకొని దానిలో పోతున్నాము. అదే విధముగనే అనంతమైన దైవత్వాన్ని మనం అనుభవించాలనుకుంటే ఏదో ఒక నామము అనే నావను మనం ఆధారం చేసుకోవాలి. ఇటువంటి ఆధారాలు ప్రారంభంలో అవసరమే కాని జీవితమంతా దానితోనే మన నిష్కర్షము చేయరాదు. ఎవరు యే సేవ చేస్తున్నా నేను సమాజానికి సేవ చేస్తున్నాను అని ఆడంబరముగాని అహంకారముగాని పడటానికి వీలులేదు. నా సేవను నీవు చేసుకుంటున్నావు. దైవానికి నీవు చేస్తున్నావు. ఇతరులకు చేస్తున్నామనే భావము దూరంగా పోవాలి. నేను దైవానికే సేవ చేస్తున్నాను. ఇంటిలో పిల్లలకు స్నానం చేయిస్తున్నావనుకో నేను దైవానికి అభిషేకం చేస్తున్నాననుకో. భర్తకో, పిల్లలకో అన్నం వడ్డిస్తున్న సమయములో నేను భగవంతునికి నైవేద్యం చేస్తున్నాననుకో. ఎవరో ఒక బిక్షగాడు వచ్చాడు. పట్టెడన్నం పెట్టినప్పుడు నా భగవంతునికి నేను అన్నాన్ని అర్పింప చేశాననుకో. అడిగేవాడు దగ్గరకాడ అనుభవించేవాడు మాత్రం ఆత్మనే. నీవు యింటిలో కూరగాయలు తరిగి పులుసు చేస్తున్నావనుకో అయ్యో నేను కూరగాయలు తరుగుతున్నానని యెందుకనుకోవాలి. నా కామక్రోధములనే దుర్గుణాలను యిష్టమనే జ్ఞానముతో తరిగి వేస్తున్నాననుకో. నీవు నీ యిల్లును వూడ్చుకుంటున్నావనుకో. అయ్యో యీ పాడు యిల్లు యెప్పుడు శుభ్రం చేసినా యింతే అవుతుందని యోచించుకోనక్కరలేదు. నా హృదయాన్ని పరిశుద్ధం చేస్తున్నాననుకో. వేం యింటిలో చపాతీ చేస్తున్నావనుకో. ఈ పాడు తిండి ఎన్ని చపాతీలు తిన్నా యీ పొట్ట నిండటంలేదే. ఎప్పుడు చూసినా చపాతీలు ప్రొద్దున్న సాయంత్రము చపాతీలే ఆ రీతిగా నీవు దూషించవద్దు. నా హృదయాన్ని విశాలం చేసుకుంటున్నాననుకో. అదే విధముగ నిత్యజీవితములో మనం చేసే ప్రతి పనిని దైవసేవగా భావిస్తుంటే యింతకంటె వేరే తపస్సెందుకు. ఇంతకంటె వేరు ధ్యానమెందుకు. ఇంతకంటె సాధనెందుకు.

కనుక మనం హృదయమే ఆత్మగా భావించుకొని, హృదయాన్ని కరగింప చేసే మార్గములో మనము ప్రయాణించెయ్యాలి. ఆ హృదయాన్ని కరగించేది ప్రేమ ఒక్కటే. నరసింహన్ చెప్పాడు ఏ ఏ దేశముల నుండో, ఏ ఏ ప్రాంతముల నుండో ఇన్ని వేలమంది వస్తున్నారంటే వారికి యే ఇన్విటేషన్ పంపటంలేదు. పేపర్లో అడ్వర్‌టైజ్‌మెంటు చేయటం లేదు. ఆ ప్రేమ తత్త్వమే వారి హృదయాల్ని కరగింపచేసి యిక్కడికి వచ్చేట్లు చేస్తుంది. ఆ ప్రేమ చేతనే మనం యెంతటిదానినైనా సాధించటానికి అవకాశం వుంటుంది. ఆ ప్రేమ తత్త్వమే ఆత్మతత్త్వముగా భావించండి. హృదయం మాత్రము కరగకుండా యెన్ని సాధనలు చేసినా, యెన్ని పలుకులు పలికినా, ఎన్ని వుపన్యాసములిచ్చినా యివన్నీ కేవలం అడవి కాచిన వెన్నెల వలె నిరుపయోగమవుతుంది. మన సాధనలతో మన హృదయం కరిగిపోవాలి. ఆ కరిగిన హృదయం కదలిపోవాలి. మన హృదయావేదనను పెంచాలి. పది మందికి పంచాలి.